షబ్బీర్‌అలీకి అభినందనలు


షబ్బీర్‌అలీకి శుభాకాంక్షలు తెలుపుతున్న పాక జ్ఞానేశ్వరి

చిక్కడపల్లి, మే 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సలహాదారు, మాజీ మంత్రి షబ్బీర్ అలీకి ఏఐసీసీ పొలిటికల్ అఫైర్స్ కమిటీలో చోటు కల్పించడం పట్ల తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి పాక జ్ఞానేశ్వరి రవిప్రసాద్ హర్షం ప్రకటించారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆమె షబ్బీర్ అలీని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.


నరసింహారావుకు నివాళులర్పిస్తున్న జనార్ధనమూర్తి తదితరులు

మునిమాణిక్యం వ్యాసాలు నిత్యసత్యాలు

చిక్కడపల్లి, మే 30 (ఆంధ్రజ్యోతి): నిత్యం ప్రతీ కుటుంబంలో జరిగే సంఘటనలను సున్నితహాస్యంతో అందించిన రచయిత మునిమాణిక్యం నరసింహారావు అని త్యాగరాయగానసభ అధ్యక్షుడు కళా జనార్ధనమూర్తి అన్నారు. ఎందరో మహానుభావులు శీర్షికల పరంపరలో భాగంగా శుక్రవారం గానసభ అధ్యక్షుడు కళా జనార్ధనమూర్తి అధ్యక్షతన తొలితరంలో తెలుగు వ్యంగ్య హాస్య రచయిత మునిమాణిక్యం జయంతి సమావేశం జరిగింది. జనార్ధనమూర్తి మాట్లాడుతూ, మునిమాణిక్యం తన కాంతం కథలద్వారా నిత్యం ప్రతీ కుటుంబంలో జరిగే సంఘటనలు చక్కగా అందించడం తెలుగువారికి గొప్ప సంపద అని ఆయన వ్యాసాలు నిత్య సత్యాలని అభిప్రాయం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గాయకుడు త్రినాథరావు, గానసభ పాలకవర్గ సభ్యుడు బండి శ్రీనివాస్, గాయకులు జైహింద్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.


ఈదమ్మ ఆలయ అభివృద్ధి పనులను పర్యవేక్షిస్తున్న పావని వినయ్‌కుమార్

ఆలయ అభివృద్ధికి కార్పొరేటర్ చేయూత

చిక్కడపల్లి, మే 30 (ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ డివిజన్‌లోని ఆలయాల పునర్‌నిర్మాణం, అభివృద్ధిలో భాగస్వామ్యం కావడం అదృష్టంగా భావిస్తున్నానని డివిజన్ కార్పొరేటర్ ఎ.పావని వినయ్‌కుమార్ అన్నారు. డివిజన్‌లోని దోబీఘాట్ ఈదమ్మ దేవాలయం అభివృద్ధికి కార్పొరేటర్ చేయూతను అందించారు. ఈసందర్భంగా శుక్రవారం ఈదమ్మ ఆలయం నిర్మాణం పనులను బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంటు జాయింట్ కన్వీనర్ వినయ్‌కుమార్ తదితర పార్టీ నేతలతో కలిసి కార్పొరేటర్ పర్యవేక్షించారు. పార్టీ డివిజన్ అధ్యక్షుడు నవీన్‌కుమార్, ఓబీసీ మోర్చా ముషీరాబాద్ అసెంబ్లీ కన్వీనర్ ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

వర్షాకాలం దృష్ట్యా జాగ్రత్తలు తీసుకోవాలి: అమృత

నల్లకుంట, మే 30 (ఆంధ్రజ్యోతి) : రాబోయే వర్షా కాలం దృష్ట్యా నల్లకుంట డివిజన్ పరిధిలో పలు జాగ్రత్తలు తీసుకోవాలని కార్పొరేటర్ యాకర అమృత అన్నారు. ఈ మేరకు శుక్రవారం జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ రవికిరణ్, డిప్యూటీ శ్రీలతలు నిర్వహించిన సమావేశంలో కార్పొరేటర్ డివిజన్ పరిధిలోని పలు అంశాలపై ప్రస్తావించారు.


సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ సుప్రియా నవీన్ గౌడ్, మీడియా సెల్ ఇన్‌చార్జి బిజ్జి కనకేష్ కుమార్

నేడు అహల్యాభాయి హోల్కర్ జయంతి ఉత్సవాలు

ముషీరాబాద్, మే 30 (ఆంధ్రజ్యోతి): పుణ్యశ్లోక, రాజమాత అహల్యాభాయి హోల్కర్ 300వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని శనివారం సాయంత్రం కవాడిగూడ ప్రధాన రోడ్డులోని సీజీవో టవర్స్ నుంచి శోభాయాత్ర నిర్వహించనున్నట్లు ముషీరాబాద్ నియోజకవర్గం బీజేపీ మీడియా సెల్ ఇన్‌చార్జి, కార్పొరేటర్ సుప్రియా నవీన్ గౌడ్ తెలిపారు. శుక్రవారం ముషీరాబాద్ బీజేపీ వార్డు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్యనాయకుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఈ శోభాయాత్ర కార్యక్రమానికి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ డాక్టర్ కె. లక్ష్మణ్, మాజీ ఎమ్మెల్యే చింతల రాంచంద్రారెడ్డి, మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు శిల్పారెడ్డి, బీజేపీ మహంకాళి జిల్లా అధ్యక్షుడు భరత్ గౌడ్ తదితరులు హాజరవుతారని తెలిపారు.

'ఫీజు రీయింబర్స్‌మెంట్' విడుదల చేయాలి

జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్ పటేల్‌గౌడ్

బర్కత్‌పుర, మే 30 (ఆంధ్రజ్యోతి) : ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.8 వేల కోట్లను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్ పటేల్‌గౌడ్ డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల 20 లక్షల మంది విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారని ఆరోపించారు. శుక్రవారం కాచిగూడ నింబోలిఅడ్డలో బీసీ కులాల ఐక్యవేదిక అధ్యక్షుడు పెండ్యాల వెంకట్, ప్రధాన కార్యదర్శి ఈశ్వర్, ఉపాధ్యక్షుడు బి.కృష్ణగౌడ్‌ల ఆధ్వర్యంలో పటేల్‌గౌడ్‌ను శాలువా మెమెంటోతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక బీసీ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 42 శాతం బీసీ రిజర్వేషన్లపై ప్రత్యేక జీవో జారీ చేసిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.

'శ్రమ జీవుల కెరటం' పుస్తకావిష్కరణ

రాంనగర్, మే 30 (ఆంధ్రజ్యోతి): కార్మికుల ఉద్యమాలకు నిలువుటద్దం శ్రమ జీవుల కెరటం పుస్తకం అని భవన నిర్మాణ రంగ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కామలి ఐలన్న పేర్కొన్నారు. శుక్రవారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో శ్రమజీవుల కెరటం పుస్తకావిష్కరణ జరిగింది. కార్యక్రమంలో కామలి ఐలన్న, ఓయూ ఉద్యమకారుడు నాలిగంట శరత్ పాల్గొని పుస్తకాన్ని ఆవిష్కరించారు.

దళితులపై దాడులు సహించం : దయానంద్

కవాడిగూడ, మే 30 (ఆంధ్రజ్యోతి): దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి దళితులపై రోజురోజుకు దాడులు, వివక్ష పెరిగిపోతుందని స్ట్రగుల్ ఫర్ జస్టిస్ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు మాస్త దయానంద్ అన్నారు. మొదట సంస్థ సభ్యులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. దేశంలోని మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని గ్వాలియర్ హైకోర్టు ఎదురుగా బీఆర్ అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటును బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్, మనువాదులు అడ్డుకోవడాన్ని నిరసిస్తూ శుక్రవారం లోయర్ ట్యాంక్‌బండ్ లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సంస్థ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు.

'అలుగు వర్షిణి పై చర్యలు తీసుకోవాలి'

నల్లకుంట, మే 30 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని గురుకుల పాఠశాలల్లో చదువుతున్న దళిత బాల, బాలికలతో పనిచేయించాలని రాష్ట్ర ఎస్సీ గురుకులాల సెక్రటరీ అలుగు వర్షిణి పేర్కొనడంపై మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పబ్బతి శ్రీకృష్ణ తీవ్ర ఆక్షేపణ వ్యక్తం చేశారు. శుక్రవారం హైదర్‌గూడలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఆమె వ్యాఖ్యలపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కింద కేసులు నమోదు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఈ వ్యాఖ్యలు దళితుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీశాయని నేషనల్ అంబేడ్కర్ జన సేన జాతీయ అధ్యక్షుడు మన్నె శ్రీధర్‌రావు ఆరోపించారు.

పనులు ఆగమాగం..!

- నామమాత్రంగా హుస్సేన్‌సాగర్ నాలా పూడిక తీత పనులు
- వృథాగా లక్షలాది రూపాయలు
- ఇబ్బందులు పడుతున్న నాలా పరీవాహక ప్రజలు


గాంధీనగర్ బ్రిడ్జివద్ద హుస్సేన్ సాగర్ నాలాలో మట్టి

కవాడిగూడ, మే 30 (ఆంధ్రజ్యోతి): జీహెచ్‌ఎంసీ అధికారుల నిర్లక్ష్యం, కాంట్రాక్టర్ ఉదాసీన వైఖరితో ఏటా వర్షాకాలంలో లోయర్ ట్యాంక్‌బండ్‌లోని హోటల్ మారియెట్‌నుంచి అశోక్‌నగర్ బ్రిడ్జివరకు నిర్వహించే హుస్సేన్‌సాగర్ నాలా పూడిక తీత పనులు నామమాత్రంగా నిర్వహించారనే ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి. దీంతో ప్రభుత్వం వెచ్చిస్తున్న లక్షలాది రూపాయలు వృథా అవుతున్నాయి. ఎన్నో ఏళ్లుగా ఇలాగే జరుగుతుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. హుస్సేన్ సాగర్ నాలాలోని ఎంసీహెచ్ క్వార్టర్స్, సుభాష్ చంద్రబోస్‌నగర్, గాంధీనగర్ బ్రిడ్జి, న్యూ అంబేడ్కర్‌నగర్, గుడాల బస్తీ, బీమా మైదాన్‌గుండా అశోక్‌నగర్ వరకు ఉన్న నాలాలో పేరుకుపోయిన మట్టికుప్పలను తొలగించాలి. ఇందుకు భిన్నంగా అధికారులు కాంట్రాక్టర్ మాత్రం గాంధీనగర్, అశోక్‌నగర్ బ్రిడ్జీలవద్ద నామమాత్రంగా నాలా పూడిక తీత పనులు చేపట్టి చేతులు దులుపుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దాదాపు రూ.5లక్షలతో చేపట్టిన పూడికతీత పనులు కేవలం గాంధీనగర్, అశోక్‌నగర్ బ్రిడ్జిల వద్ద పూడిక తీసి చేతులు దులుపుకోవడం ఎంతవరకు సమంజసమని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. పూడిక తీసే సమయంలో స్థానికులు తమ ప్రాంతంలో పూడిక తీయాలని కోరినా ఎవరూ పట్టించుకోవడం లేదని దీంతో దోమలు వ్యాపించెంది ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఆ మట్టిని కూడా పూర్తిగా తరలించకపోవడంతో మిగిలిన మట్టిని నాలాలో ఓవైపు వేసి వెళ్లిపోతున్నారని పలువురు పేర్కొంటున్నారు. ఈ విషయంపై జీహెచ్‌ఎంసీ అధికారులను సిబ్బందిని ప్రశ్నిస్తే తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు. వర్షాలు బాగా కురిసి నాలాలో వరదనీరు వస్తే అధికారులు వచ్చి ఆగమేఘాల మీద తమ బస్తీలకు వచ్చి వెంటనే ఇళ్లను ఖాళీ చేయాలని ఆదేశాలు జారీ చేయడం ప్రతీ సంవత్సరం పరిపాటిగా మారిందన్నారు. ముందే పూడిక తీత సమయంలో అధికారులు పర్యవేక్షించి నాలాలో పేరుకుపోయిన మట్టిని తొలగించి వివిధ ప్రాంతాలకు తరలిస్తే ఇలాంటి సమస్యలు రావని వారు చెబుతున్నారు. ఈ విషయంపై వివరణ కోరేందుకు జీహెచ్‌ఎంసీ డీఈ సన్నిని సంప్రదించగా ఆయన సమాధానం ఇవ్వలేదు.


అశోక్‌నగర్ బ్రిడ్జి నాలా వద్ద కుప్పలుగా పోసిన మట్టి

జీహెచ్‌ఎంసీ అధికారుల దృష్టికి తీసుకెళ్తా



వైస్రాయ్ హోటల్ చౌరస్తా నుంచి గాంధీనగర్, అశోక్‌నగర్ బ్రిడ్జివరకు నాలా పూడిక తీత పనుల విషయంపై అధికారుల దృష్టికి తీసుకెళతా. నిర్లక్ష్యంగా వ్యవహరించిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి. నాలాలో కేవలం రెండు బ్రిడ్జిల వద్ద కాకుండా మిగతా ప్రాంతాల్లో ఉన్న మట్టిని కూడా తొలగించాలి. - జి.రచనశ్రీ, కవాడిగూడ కార్పొరేటర్

నామమాత్రంగా పూడికతీత పనులు



హుస్సేన్ సాగర్‌లో నాలా పూడిక తీత పనులను నామమాత్రంగా చేపట్టడం వల్ల నాలా పరీవాహక ప్రాంత ప్రజలు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. ప్రతీసారి పూడిక తీత పనులు పైపైన చేపట్టి కాంట్రాక్టర్ చేతులు దులుపుకుంటున్నారు. ఈ విషయంపై ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదు.

- రావుల నర్సింహ, అంబేడ్కర్‌నగర్

అభివృద్ధి పనుల వేగవంతానికి చర్యలు

● కార్పొరేటర్ల ప్రతిపాదనలకు ప్రాధాన్యత ● జీహెచ్‌ఎంసీ సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ రవికిరణ్, డిప్యూటీ మేయర్ శ్రీలతరెడ్డి



కార్పొరేటర్లు, అధికారుల సమీక్ష సమావేశంలో జోనల్ కమిషనర్ రవికిరణ్, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతరెడ్డి, ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాల కార్పొరేటర్లు

రాంనగర్, మే 30 (ఆంధ్రజ్యోతి) : ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాలలోని పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు, స్థానిక సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు చేపడతామని జీహెచ్‌ఎంసీ సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ రవికిరణ్, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతరెడ్డి, ఎస్‌ఈ ఆశాలత అన్నారు. శుక్రవారం జోనల్ కార్యాలయంలో అభివృద్ధి కార్యక్రమాలు, సమస్యలపై జోనల్ కమిషనర్ అధ్యక్షతన కార్పొరేటర్లతో సమీక్ష జరిగింది. సమావేశంలో ముషీరాబాద్ నియోజకవర్గం కార్పొరేటర్లు కె.రవిచారి, సుప్రీయా నవీన్‌గౌడ్, గౌసుద్దీన్, జి.రచనశ్రీ, పావని వినయ్‌కుమార్, అంబర్‌పేట నియోజకవర్గం కార్పొరేటర్లు పద్మావెంకటరెడ్డి, అమృత, కన్నె ఉమాదేవి, దూసరి లావణ్య, విజయ్‌కుమార్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ నూతనంగా నిర్మించాల్సిన రోడ్ల నిర్మాణం, పార్కుల అభివృద్ధి, నాలాల ఆధునీకరణ తదితర అంశాలపై చర్చించారు. వర్షా కాలంలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపడుతున్నామని, ఇందుకు కార్పొరేటర్లు సహకరించాలన్నారు.

డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ, అభివృద్ధి కార్యక్రమాల నిర్వహణలో ఎలాంటి జాప్యం లేకుండా అధికారులు పనిచేయాలన్నారు. రాంనగర్ డివిజన్‌లోని పలు సమస్యలపై కార్పొరేటర్ కె.రవిచారి జోనల్ కమిషనర్, డిప్యూటీ మేయర్లకు వినతిపత్రం సమర్పించారు. బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లోని మల్లికార్జున్‌నగర్, బతుకమ్మకుంట ప్రాంతాలలోని వరదనీటి కాలువలను ఆధునికీకరించి వర్షా కాలంలో సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ పద్మావెంకటరెడ్డి కోరారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలతో కార్మికులకు అన్యాయం

సీఐటీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి తపన్ సేన్



మాట్లాడుతున్న తపన్ సేన్

రాంనగర్, మే 30 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు ప్రజలు, కార్మికులు, కుల, మతాల మధ్య చిచ్చుపెడుతున్నాయని సీఐటీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి తపన్ సేన్ ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక రంగంలో సంస్కరణల పేరుతో కార్మికులపై దాడి చేస్తుందని ధ్వజమెత్తారు. 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చి కార్మికులకు తీరని అన్యాయం చేస్తుందని ఆరోపించారు. రాంనగర్‌లోని హరినగర్‌లో శుక్రవారం నిర్మించిన సీఐటీయూ తెలంగాణ రాష్ట్ర నూతన కార్యాలయ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కేంద్ర ప్రభుత్వం వ్యతిరేక విధానాలపై అన్ని కార్మిక సంఘాలు కలిసి ఉమ్మడిగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. దేశంలో ఏర్పడ్డ పరిస్థితుల వల్ల సమ్మెను మే 20 నుంచి జూలై 9వ తేదీకి వాయిదా వేశామన్నారు. సీఐటీయు ఉమ్మడి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన బీ.వీ.రాఘవులు, సీఐటీయూ అఖిల భారత అధ్యక్షురాలు కె.హేమలత, కోశాధికారి ఎం.సాయిబాబా, ఉపాధ్యక్షులు ఆర్.లక్ష్మణ్, రాష్ట్ర మాజీ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.వీరయ్య, ఆర్.సుధాభాస్కర్, ఉమ్మడి రాష్ట్రాల నాయకులు సీ.హెచ్.నర్సింగ్ రావు, ఎం.ఏ.గఫూర్‌లు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాల వల్ల కార్మికులకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు. సమావేశానికి సీఐటీయూ నాయకులు రాములు అధ్యక్షత వహించగా పాలగుడు భాస్కర్, వంగూరి రాములు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమానికిముందు సీఐటీయు జెండాను పి.రాజారావు ఆవిష్కరించారు.

ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి : జేఏసీ


ముషీరాబాద్ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఉద్యమ కారులు

కవాడిగూడ, మే 30 ఆంధ్రజ్యోతి): తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఉద్యమ కారులకు ఇచ్చిన హామీలను అమలు చేసి ఆదుకోవాలని లేని పక్షంలో పెద్దఎత్తున ఉద్యమం చేపడతామని తెలంగాణ ఉద్యమ కారుల జాయింట్ యాక్షన్ కమిటీ సెక్రటరీ జనరల్ ప్రఫూల్ రాంరెడ్డి హెచ్చరించారు. ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమ కారులకు ఇచ్చిన హామీలను అమలు చేసే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని తెలంగాణ ఉద్యమ కారుల జాయింట్ యాక్షన్ కమిటీ సెక్రటరీ జనరల్ తుమ్మల ప్రఫూల్ రాంరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని ముషీరాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రాణాప్రతాప్‌సింగ్‌ను ఉద్యమ కారులతో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు కావస్తుందని, గత ప్రభుత్వం తెలంగాణ ఉద్యమ కారులను పట్టించుకోలేదన్నారు. టీయూజేఏసీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా పోరాటం చేస్తున్నామని ప్రభుత్వం స్పందించడం లేదని జూన్ 2 వరకు ఉద్యమ కారుల సమస్యలు పరిష్కరిస్తామని స్పష్టమైన ప్రకటన రావాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఉద్యమాన్నిమరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీయూజేఏసీ రాష్ట్ర నాయకులు చంద్రన్న ప్రసాద్, మోహన్ బైరాగి, స్వరూప, లలిత. సుచరిత, నర్సయ్య పాల్గొన్నారు.

'స్వామినాథన్' సిఫారసులను విస్మరించిన కేంద్రం

చిక్కడపల్లి, మే 30 (ఆంధ్రజ్యోతి): 2025-26 ఖరీఫ్ సీజన్ కోసం బీజేపీ నేతృత్వంలోని కేంద్రప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధరలు ప్రధాని మోదీ చేసిన మరో ద్రోహం అని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు పోతినేని సుదర్శన్‌రావు, టి.సాగర్ ఆరోపించారు. కమిటీ సిఫారసులను బీజేపీ ప్రభుత్వం విస్మరించిందని వారు ఒక ప్రకటనలో ఆరోపించారు. సవరించి రైతులకు లాభసాటి ధర అందేవిధంగా మార్చాలని వారు డిమాండ్ చేశారు.

ఎక్సైజ్ అధికారులకు పట్టుబడిన వాహనాల వేలం

ముషీరాబాద్, మే 30 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా గంజాయి, మద్యాన్ని అక్రమంగా రవాణా చేసి పట్టుబడిన వాహనాలను స్టేషన్‌లో వేలం వేశారు. ఎక్సైజ్ అసిస్టెంటు సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రావు, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ పర్యవేక్షణలో 12 వాహనాలను వేలం వేశారు. ఈ వేలం పాటలో ఎక్సైజ్ శాఖకు రూ.1,96,980 వచ్చాయని వారు తెలిపారు.

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి

రాంనగర్, మే 30 (ఆంధ్రజ్యోతి): రాంనగర్ చౌరస్తా నుంచి వీఎస్టీకి వెళ్లే మెయిన్ రోడ్డులో గల గరుండా అపార్ట్‌మెంట్ ముందు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని చిక్కడపల్లి ట్రాఫిక్ సీఐ వీరేశంకు వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యుడు గురుదత్త వినతిపత్రం అందజేశారు.

భక్తిని నింపిన దేవీ వైభవం

చిక్కడపల్లి, మే 30 (ఆంధ్రజ్యోతి): వేదభారతి కల్చరల్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం త్యాగరాయగానసభలో నిర్వహించిన దేవీ వైభవం సంకీర్తనామాలిక కార్యక్రమం శ్రోతల్లో భక్తిని నింపింది.

ఆర్టీసీ కార్మికుల సంక్షేమానికి సానుకూలమే: ఈడీ

రాంనగర్, మే 30 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ కార్మికుల సంక్షేమానికి ఆర్టీసీ యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆర్టీసీ ఈడీ మునిశేఖర్ అన్నారు. శుక్రవారం బాగ్‌లింగంపల్లిలోని వీఎస్టీ హాల్‌లో ఆర్టీసీ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం శ్రీనివాస్ పదవీ విరమణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ కార్మికుల ప్రయోజనాల కోసం ఆర్టీసీ యాజమాన్యం పలు కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. ఈ సందర్భంగా సంఘం నాయకుడు గడ్డం శ్రీనివాస్, సూర్యకళ దంపతులను నాయకులు ఘనంగా సత్కరించారు.

10 నుండి జీఆర్‌ఈ, జీమాట్, టోఫెల్‌లో శిక్షణ

ముషీరాబాద్, మే 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం సాంఘిక సంక్షేమ శాఖ సహకారంతో విదేశీ విద్య అర్హత పరీక్షలైన జీఆర్‌ఈ, జీమాట్, ఐఈఎల్‌టీఎస్, టోఫెల్‌లలో ఎస్సీ విద్యార్థులకు ఉచిత శిక్షణను జూన్ 10 నుండి ఇవ్వనున్నట్లు కెరీర్ అబ్రాడ్ డైరెక్టర్ అరవింద్ రెడ్డి తెలిపారు. శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... డిగ్రీ, బీటెక్, పీజీ విద్యార్థులు శిక్షణకు అర్హులని తెలిపారు. మలక్‌పేట్‌లో ఉన్న తమ సంస్థ కార్యాలయంలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. విద్యార్థులు తమ పేర్ల నమోదుకు, ఇతర సమాచారానికి 8106738252, 9347038873 ఫోన్‌లో సంప్రదించాలని కోరారు.

నేడు ధూమపానంపై అవగాహన సదస్సు

ముషీరాబాద్, మే 30 (ఆంధ్రజ్యోతి): శనివారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని ముషీరాబాద్ యూపీహెచ్‌సీలో అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు శుక్రవారం ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ మనోజ్ రెడ్డి తెలిపారు.


థియేటర్ మెయిన్‌గేట్ వద్ద ఇబ్బందులు రాకుండా చూస్తున్న థియేటర్ మేనేజర్లు, సిబ్బంది

ఖలేజా రీ రిలీజ్ హంగామా

ట్రాఫిక్ జామ్ - టిక్కెట్ల కోసం పైరవీలు

చిక్కడపల్లి, మే 30 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఆర్టీసీక్రాస్‌రోడ్‌లో సినిమాల రీ రిలీజ్ పండుగ సాగుతోంది. కొత్తసినిమాలు విడుదలైనా కూడా అంత సందడి ఉండనిది ఎప్పుడో పదహారేళ్ల కిందట మహేష్‌బాబు నటించిన ఖలేజా సినిమా సుదర్శన్ 35ఎంఎం థియేటర్‌లో శుక్రవారం రీరిలీజ్ కావడంతో టిక్కెట్ల కోసం పైరవీలు సాగాయి. ఆన్‌లైన్‌లో టిక్కెట్ల బుకింగ్ కోసం థియేటర్‌వద్ద ప్రేక్షకులు బారులు తీరారు. సమీపంలోని సంధ్య థియేటర్‌లో గత ఏడాది డిసెంబర్ 4న రాత్రి జరిగిన పుష్ప 2 సంఘటన నేపథ్యంలో టిక్కెట్‌ఉన్నవారినే థియేటర్ లోపలికి రానిస్తుండడంతో క్రాస్‌రోడ్‌లో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. సుదర్శన్, దేవి థియేటర్ల మేనేజర్లు, పోలీసులు, సిబ్బంది మెయిన్‌గేట్ వద్ద నిలబడి గొడవలు, ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడకుండా పహారా కాశారు. గురువారం అర్ధరాత్రి కూడా షో నడిచింది. వారం రోజులనుంచి టిక్కెట్ల కోసం పైరవీలు కొనసాగాయి.

రైలుకింద పడి కూలీ ఆత్మహత్య

బర్కత్‌పుర, మే 30 (ఆంధ్రజ్యోతి) : రైలు కిందపడి కూలీ ఆత్మహత్య చేసుకున్నాడు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పుగూడలో నివాసం ఉంటున్న నాగయ్య కుమారుడు చాకలి చంద్ర (47) కూలీ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కొంత కాలంగా కుటుంబ సమస్యలతో పాటు అనారోగ్యంతో బాధపడుతున్నాడు. జీవితంపై విరక్తి చెందిన చంద్ర గురువారం అర్ధరాత్రి ఉప్పుగూడ రైల్వే స్టేషన్ సమీపంలో వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

గృహిణి ఆత్మహత్య

చిక్కడపల్లి, మే 30 (ఆంధ్రజ్యోతి): ఓ గృహిణి ఆత్మహత్య చేసుకున్న సంఘటన చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. ఇండ్లల్లో పనిచేసే సూర్యనగర్‌కు చెందిన స్వరూప భర్త పాపయ్య ఇద్దరు కుమారులతో నివసిస్తోంది. కాగా ఇటీవల ఊరిలో ఇంటిస్థలం కొనడానికి చేసిన అప్పు తీర్చకుండా భర్త మద్యానికి బానిస కావడంతో మనోవేదనకు గురైన ఆమె రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ తెలిపారు.

నేడు ఆర్టీసీ డయల్ యువర్ డీఎం

బర్కత్‌పుర, మే 30 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం, తగు సలహాలు, సూచనలకై ఈ నెల 31న డయల్ యువర్ ఆర్టీసీ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు బర్కత్‌పుర డిపో మేనేజర్ ఆర్.మంజుల తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చిక్కడపల్లి, మే 30 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ సిటీ-1, ఆజామాబాద్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈలు వినోద్‌కుమార్, నాగేశ్వరరావు తెలిపారు. తాళ్లబస్తీ, గుల్షన్‌నగర్, ఐసీఐసీఐ బ్యాంక్ 11కేవీ విద్యుత్ ఫీడర్ల పరిధిలో ఉదయం 9నుంచి 11, ఏపీఎస్‌ఈబీ పరిధిలో 9నుంచి 10, కలెక్టర్ ఆఫీస్ పరిధిలో 10నుంచి 10.30, జడ్పీ ఆఫీస్, నారాయణగూడ పరిధిలో 10నుంచి 11, ఐఓఈ పరిధిలో 10.30నుంచి 11, కూచిపూడి, లేక్‌వ్యూ, ఉర్దూహాల్, జీబీ పరిధిలో మధ్యాహ్నం 3నుంచి5, క్షత్రియ, 44 బస్టాప్ పరిధిలో 3నుంచి 4, డీడీహెచ్ పరిధిలో 4నుంచి 5 వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.